
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం ၊ 6 ၊ జనవరి ၊ 2025



సోమశిలలో 71.622 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 71.622 టీఎంసీలు ఉన్నాయి. 2500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 2050, ఉత్తరకాలువకు 600, కండలేరుకు 200, దక్షిణకాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రా)	రూ.79,480
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,215
3శాతం జీఎస్టీతో	రూ.7,431
నవర (8 గ్రా)	రూ.59,448

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.6 /22.1

జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుముఖం పట్టనున్నాయి. ఆదివారం గాలిలో తేమ 74 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

సంఘటితంగా ఉంటేనే సమస్యలకు పరిష్కారం

- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ ఉద్యోగుల సమావేశం



నూతన కార్యవర్గం

నెల్లూరు (సెంట్రల్): ఉద్యోగులందరూ సంఘటితంగా ఉంటేనే సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ ఉద్యోగుల సంఘ నేతలు అభిప్రాయపడ్డారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యవసాయశాఖలోని పరిపాలన అధికారి నుంచి ఆఫీసు సబార్డినేట్ వరకు విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమావేశం ఆదివారం స్థానిక జిల్లా వ్యవసాయ అధికారి ప్రాంగణంలోని బీసీ ల్యాబ్ మీటింగ్ హాల్లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సమావేశం జరిగింది. జిల్లా ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు బసిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన సమస్యలపై చర్చించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి వి రఘురామనాయుడు అభినందించారు. రాష్ట్ర అధ్యక్షుడు టీవీ రామిరెడ్డి, సహా అధ్యక్షుడు వి.రఘురామనాయుడు, రాష్ట్ర కోశాధికారి దొగురు శ్రీహరి, ఉపాధ్యక్షులు షేక్ జహీర్ అహ్మద్, హెచ్.రూపేష్‌కుమార్, ఎం.శ్రీహరి, బి.సురేంద్ర, కడప జిల్లా అధ్యక్షుడు ఎం ఏ ప్రసాద్‌గౌడ్, కార్యదర్శి ఎస్.గిరిధర్, ఇతర జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

అధ్యక్షుడిగా ఎం.శాంతరాజు, కార్యదర్శిగా ఎంవీ సువర్ణకుమారి, సహాధ్యక్షుడిగా సీహెచ్ నాగరాజు, కోశాధికారిగా పి.సత్యం, ఉపాధ్యక్షులుగా సీహెచ్ రోజామణి, ఎస్కే మహబూబ్ బాషా, సీహెచ్‌వీఎం మురళి, సంయుక్త కార్యదర్శులుగా డి.అనిల్, సీహెచ్ సాత్విక్ రాజు, వై.శివాజీ, కుమారి పి.సాయి సున్నైని, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కె.డేవిడ్, పీవీ నాగలక్ష్మి, జిల్లా ఈసీ సభ్యులుగా బి.సందీప్ రాజు, బాలబ్రహ్మయ్య, జి.రమేష్, బి.కౌసలమ్మ రాష్ట్ర ఈసీ సభ్యుడిగా ఎస్కే నిశాంత్ అహమ్మద్ ఎంపికయ్యారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపుతున్న అలసత్వం, వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. నెల్లూరులో ఫిబ్రవరిలో జరగనున్న రాష్ట్ర 27వ సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నగరంలోని 54వ డివిజన్ జనార్దనరెడ్డికాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, కార్యదర్శివర్గ సభ్యులు నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, మూలం ప్రసాద్, సభ్యులు జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

పాషాణజలం

ధనార్జనే ధ్యేయంగా రొయ్యల శుద్ధి పరిశ్రమలు నిబంధనలకు పాతరేస్తున్నాయి. పరిసరాల వాతావరణాన్నే కాకుండా భూగర్భ, పంట కాలువల్లోని జలాలను కాలుష్య కోరల్లో ముంచెత్తున్నాయి. ఈ తరహా పరిశ్రమల ఏర్పాటు సమయంలోనే నిర్దిష్ట ప్రమాణాలు పాటిస్తూ.. కలుషిత జలాల శుద్ధి వంటి వసతులు ఏర్పాటు చేశారా? చేశాక నిర్వహిస్తున్నారా? అనే విషయాలను పరిశీలించి అనుమతులు ఇవ్వడం, ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత శాఖాధికారులు అవినీతిలో మునిగి తేలుతూ.. మసిపూసి మారేడు కాయ చేస్తున్నారు. ఈ పరిశ్రమలకు చుట్టు పక్కల జల, వాయు కాలుష్యంతో మనుషులతో పాటు పశువులు ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నాయి.

- సాగునీటి కాలువల్లోకి రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ల వ్యర్థాలు
- భూగర్భ జలాలే కాక.. నీటి దొరువులు జల కాలుష్యం
- వీటి సమీపంలోని 20 వేల ఎకరాల సాగు భూములు నిర్జీవం
- కలుషిత నీరు తాగి వేలాది పశువుల మృతి
- తాగునీటితో జీర్ణకోశ, కేన్సర్ వ్యాధులు





కొడవలూరు మండలంలో కాలువలో వ్యర్థాలను వదిలేందుకు వీలుగా నిర్మించిన పైపులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని రొయ్యల శుద్ధి పరిశ్రమలు జీవరాసుల మనుగడకు ప్రమాదఘంటికలు మోగిస్తున్నాయి. అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. రొయ్యల ప్రాసెసింగ్ కోసం వినియోగించే ప్రమాదకర రసాయనాలతో కూడిన కలుషిత వ్యర్థ జలాలను నేరుగా సాగునీటి కాలువల్లోకి, ఆరు బయట ఖాళీ ప్రదేశాల్లోకి వదిలేస్తున్నారు. దీంతో సారవంతమైన సాగు భూములు నిర్జీవంగా మారిపోతున్నాయి. భూగర్భ జలాలు విషపూరితమై ప్రమాదకరమైన ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతున్నాయి. కొన్నేళ్లుగా రొయ్యల ప్రాసెస్ యూనిట్లలో జరిగే ఈ దుర్మార్గమైన వ్యవహారాన్ని అటు పరిశ్రమలు యజమాన్యాలు, ఇటు మత్స్యశాఖాధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వెలుగులోకి రానివ్వడం లేదు. స్థానికంగా రైతులు, ప్రజలు గగ్గోలు పెడుతున్నా.. అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతూ కళ్లకు గంతలు కట్టుకున్నారు.

సీడ్ నుంచి ఫీడ్.. ప్రాసెసింగ్ వరకు ఇక్కడే..

జిల్లాలో అధికారిక గణాంకాల ప్రకారం దాదాపు 33,128 ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. ఆక్వా రంగానికి సంబంధించి సీడ్ నుంచి ఫీడ్ పరిశ్రమలతో పాటు రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. మూడు ఫీడ్ ప్లాంట్లతోపాటు పది వరకు రొయ్యల ప్రాసెస్ యూనిట్లు, 61 సీడ్ హేచరీలు ఉండగా అందులో 22 సీడ్ హేచరీలే రన్నింగ్‌లో ఉన్నాయి. ఆయా ప్రాసెస్ యూనిట్లు, హేచరీల్లో అడుగడుగునా నిబంధన ఉల్లంఘనలు జరుగుతున్నాయి. చాలా వరకు పీసీబీ ప్రమాణాలు పాటించడం లేదు. యూనిట్ల నుంచి వచ్చే రసాయనాలు కలిసిన వ్యర్థాలు పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. దీంతో భూములు నిర్జీవంగా మారి, చౌడు బారి బీడ్లుగా మారిపోతున్నాయి. పైర్లు ఎదుగుదల క్షీణించిపోతుంది. ఆ ప్రాంతంలో ఆ నీరు భూగర్భంలోకి ఇంకిపోవడంతో తాగునీరులో కూడా విషం నిండి ఉండడంతో ఎన్నో వ్యాధులు ప్రబలి మనుషుల ప్రాణాలకే హాని కలిగిస్తోంది.

హరిస్తున్న పశువుల ప్రాణాలు

రొయ్యల శుద్ధికి సోడియం, క్లోరైడ్, అమ్మోనియా వంటి ప్రమాదకర రసాయనాలు వాడుతారు. ఈ వ్యర్థ జలాలను నేరుగా కాలువల్లోకి వదిలేయడంతో ఆ నీటిని తాగడం వల్ల పశువులకు స్థానిక ప్రజలకు ప్రాణ సంకటంలా మారుతోంది. గత పదేళ్లలో వివిధ రకాల వ్యాధులతో రెండు వేల వరకు పశువులు మృతి చెందినట్లు తెలుస్తోంది. వెటన్నరీ వైద్యుల శాంపిల్స్ ల్యాబ్‌లో పరీక్షిస్తే కలుషిత నీటితో వచ్చే వ్యాధులు సోకినట్లు గుర్తించినట్లు తెలుస్తోంది.

తినే ఆహారం విషమే

రసాయనాలు కలిసిన సాగునీటి వల్ల ఈ ప్రాంతంలో సారవంతమైన పొలాలు లవణ (ఉప్పు) శాతం పెరిగి చౌడు బారాయి. భూముల్లోని ఐదు పొరల్లో చౌడు బారి పంటల ఎదుగుదల నిలిచిపోయింది. ఈ ప్రాంతంలో భూగర్భ జలాల్లోనూ రసాయనాలు కలుస్తున్నాయి. కలుషిత నీటితో పండిన పంట ఉత్పత్తులు తినడం వల్ల జీర్ణకోశ వ్యాధులు, అతిసారా, గ్యాస్ట్రో, కేన్సర్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

ఉదాహరణలు ఇవిగో..

- టీపీగూడూరు మండలంలో ఉన్న ఓ రొయ్యల ప్రాసెస్ యూనిట్ నుంచి రసాయనాలతో కూడిన వ్యర్థ జలాలను ఈదూరు, కోడూరు జాయింట్ చెరువు నుంచి వెళ్లే పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఆ కాలువ కింద దాదాపు 5 వేల ఎకరాలకు పైగా సాగవుతోంది. రసాయనాలు కలిసిన నీరు పంట పొలాల్లోకి చేరడంతో పంట భూములు నిర్జీవంగా మారుతున్నాయి. వెంకన్నపాళెంలో ఉన్న సీడ్ ప్లాంట్ నుంచి వచ్చే రసాయనాల నీరు బకింగ్‌హాం కెనాల్‌లోకి వదిలేస్తున్నారు.
- కోడూరు బీచ్ సమీపంలో ఏర్పాటు చేసిన హేచరీలు ల నుంచి వ్యర్థ జలాలు బకింగ్‌హాం కెనాల్‌లోకి వదిలేస్తున్నారు. రసాయనాలు కలిసిన వ్యర్థ జలాలు కాలువలో కలిసి పోవడంతో మత్స్య సంపదకు ముప్పు వాటిల్లుతోంది. ఆ చేపలను తింటే పలు రకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- కొడవలూరులో మూడు ప్రాసెసింగ్ యూనిట్లు పంట పొలాల మధ్య ఏర్పాటు చేశారు. వీటి నుంచి విడుదల చేసే వ్యర్థ జలాలు మలిదేవి డ్రైయిన్‌లో వదిలేస్తున్నారు, ఆ డ్రైయిన్ పరిధిలో ఆల్లూరుపాడు, మోడేగుంట, మానేగుంటపాడు గ్రామాల పరిధిలోని దాదాపు 300 ఎకరాలు ఆయకట్టులో పంటలు సాగువుతున్నాయి. రసాయనాలు కలిసిన జలాలు డ్రైయిన్‌లో కలవడం వల్ల ఆ నీరు పారే భూములు చౌడు తేలి పంటల ఎదుగుదల క్షీణించిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.
- గండవరం వద్ద ఏర్పాటు చేసిన ఓ ప్రాసెస్ యూనిట్ నుంచి వచ్చే రసాయన వ్యర్థ జలాలు పైడేరులోకి వదిలేస్తున్నారు.. ఆ పైడేరు కింద అల్లూరు మండలంలోని నార్తుమోపూరు, ఆములూరు గ్రామాలకు చెందిన 800 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది.



కోడూరు బీచ్ వద్ద ఉన్న హేచరీలోని వ్యర్థాలను పైప్ లైన్ ద్వారా కాలువలోకి వదులుతున్న దృశ్యం

జిల్లాలో ఉన్న రొయ్యల ప్రాసెస్ యూనిట్లు

1. స్టార్ ఆగ్రో మెరైన్ ఎక్స్‌పోర్ట్, ఇందుకూరుపేట మండలం
2. ఫైవ్ స్టార్ మెరైన్ ఎక్స్‌పోర్ట్, నారాయణరెడ్డిపేట, నెల్లూరు రూరల్
3. బీఎంఆర్ ఇండస్ట్రియల్ ప్రైవేట్ లిమిటెడ్, దామవరం, దగదర్తి మండలం
4. వాటర్ బేస్ లిమిటెడ్, అనంతపురం, టీపీగూడూరు మండలం
5. సాయి మెరైన్ ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, నారాయణరెడ్డిపేట నెల్లూరు రూరల్
6. శరత్ ఇండస్ట్రియల్ లిమిటెడ్, టీడీగూడూరు మండలం
7. అల్ఫా మెరైన్ లిమిటెడ్ గండవరం, కొడవలూరు మండలం
8. గ్రీన్‌హౌస్ ఆగ్రో ప్రొడెక్ట్, కొడవలూరు మండలం
9. ఆంజనేయ సీఫుడ్స్ కొడవలూరు మండలం
10. ఫెదోరా సీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కొడవలూరు మండలం

శుద్ధి ప్రక్రియ ఇలా..

రొయ్యల శుద్ధి కేంద్రాల్లో రియల్ టైం పొల్యూషన్ తెలిపే ఆర్‌టీపీఎంఎస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. సూయేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసి శుద్ధి చేసిన వ్యర్థ జలాలను అందులోకి పంపిచాలి. కానీ ఆ ప్లాంట్ ఏర్పాటు ఖర్చుతో కూడుకుంది కావడంతో ప్లాంట్ యజమానులు నేరుగా బయట పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. వాస్తవంగా రొయ్యల శుద్ధిలో ఏడు రకాల రసాయనాలు వాడుతారు పీసీబీ ప్రమాణాలకు లోబడి శుద్ధి చేయాలి. శుద్ధి చేసిన వ్యర్థాలను డిస్పోజ్ కంపెనీకి అప్పగించాలి. అయితే అందుకు విరుద్ధంగా వాటిని అక్కడిక్కడే బయట రోడ్ల పక్కనే పారబోస్తున్నారు.



టీపీగూడూరుకు వెళ్లే దారిలో మహాలక్ష్మీపురం వద్ద ఉన్న రొయ్యల పరిశ్రమ

మా భూములు చౌడుబారుతున్నాయి



రొయ్యలు శుద్ధి చేసిన నీరు పంట కాలువల్లోకి వదిలేస్తుండడంతో భూములు చౌడు బారి పోతున్నాయి. పంటలు ఎదుగుదల ఉండడం లేదు. భూమి పొరల్లో చౌడులా మారి పోతున్నాయి. ఏదైనా ఉద్యాన పంటలు వేసుకుందామన్నా.. పంట ఎదుగుదల లేదు. ఎన్నో సార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

– ఊటుకూరు శ్రీనివాసులు, రైతు, కోడూరు

పంటలు నాశనం అయిపోతున్నాయి..



నార్తురాజుపాళెంలోని రెండు, కోవూరులోని ఒక రొయ్యల ప్రాసెస్ ఫ్యాక్టరీల్లోని వ్యర్థ నీటిని మలిదేవిలోకి పైప్‌లైన్ల ద్వారా వదిలేస్తున్నారు. ఈ నీటినే రామన్నపాళెం, మానేగుంటపాడు, ఆలూరుపాడు, మోడేగుంట రైతులు వరి సాగుకు ఉపయోగిస్తుండడంతో పంటలు నాశనమవుతున్నాయి. కలుషిత నీరైనందున పంట ఆరోగ్యకరంగా పెరిగేందుకు ఈ కలుషిత నీరు ఇబ్బందికరంగా మారుతున్నాయి.

– కారంపూడి సుబ్బరామిరెడ్డి, రైతు, మానేగుంటపాడు, కొడవలూరు మండలం

ప్రతి హేచరీని, ప్రాసెస్ యూనిట్లలో తనిఖీలు చేస్తాం

రొయ్యల ప్రాసెస్ యూనిట్లు, సీడ్ తయారీ హేచరీస్‌ల నుంచి వచ్చే వ్యర్థజలాలు పంట కాలువల్లోకి వదిలివేయకూడదు. స్థానికంగా స్లూయిజ్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుని ఆ కలుషిత జలాలను శుద్ధి చేసి తిరిగి వాడుకోవచ్చు. పంట కాలువల్లోకి వదిలివేయడం చట్ట ప్రకారం నేరం. త్వరలోనే అన్ని ప్లాంట్లు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వరరావు, మత్స్యశాఖ జేడీ నెల్లూరు

క్యారమ్‌కు ఏపీ మరో పవర్‌హౌస్

- ఇంటర్నేషనల్ క్యారమ్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ (స్విట్జర్లాండ్) జోసఫ్ మేయర్
- ఆలిండియా ఫెడరేషన్ క్యారమ్స్ టోర్నమెంట్ ప్రారంభం



29వ ఆలిండియా ఫెడరేషన్ కప్ టోర్నమెంట్- 2025ను ప్రారంభిస్తున్న ఇంటర్నేషనల్ క్యారమ్ ఫెడరేషన్ (ఐసీఎఫ్) అధ్యక్షుడు, జోసఫ్ మేయర్ (స్విట్జర్లాండ్), ఆలిండియా క్యారమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, అసోం ఎంపీ రఖీబుల్‌హుస్సేన్ తదితరులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): భారతదేశంలో క్యారమ్ క్రీడకు ఆంధ్రప్రదేశ్ మరో పవర్ హౌస్‌గా మారుతోంది. ప్రతి సంవత్సరం క్రీడాకారుల సంఖ్య, ప్రతిభ పెరుగుతోందని ఇంటర్నేషనల్ క్యారమ్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ (స్విట్జర్లాండ్) జోసఫ్ మేయర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ క్యారమ్స్ అసోసియేషన్, నెల్లూరు క్యారమ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న 29వ ఆలిండియా ఫెడరేషన్ క్యారమ్ టోర్నమెంట్ -2025 పోటీలు ఆదివారం నగరంలోని నెల్లూరుక్లబ్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జోసెఫ్ మాట్లాడుతూ క్రీడలు జీవితాలను మారుస్తాయన్నారు. భారతదేశంలో పలు ప్రాంతాల్లో ఈ క్రీడ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇటీవల జరిగిన ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారిణి ఖాజీమా విజేతగా నిలవడం నిదర్శనమన్నారు. ఇండియాలో మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఔత్సాహిక క్యారమ్ క్రీడా కార్యవర్గం కలిసికట్టుగా పనిచేస్తున్నాయన్నారు. భారతదేశంలో క్రీడాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఈ బోర్డు మీటింగ్‌లో చర్చిస్తామని, క్యారమ్ ఫెడరేషన్‌కు సంబంధించిన కోర్టు వివాదాలు తొలగనున్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగే టోర్నమెంట్‌లో రూ.5 లక్షలు, రూ.7 లక్షలు, రూ.8 లక్షలు నగదు ప్రోత్సాహకాలతోపాటు ఈ ఏడాది వరల్డ్ కప్‌కు రూ.13 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నామన్నారు. భారత ప్రభుత్వం, దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలు ముఖ్యంగా తమిళనాడు వంటి రాష్ట్రం క్యారమ్ క్రీడాకారులకు భారీ స్థాయిలో నగదు ప్రోత్సాహకాలను అందజేస్తోందన్నారు. ఆల్ ఇండియా క్యారమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, అసోం ఎంపీ రఖీబుల్‌హుస్సేన్ మాట్లాడుతూ దేశంలో క్యారమ్ క్రీడను ఆడే రాష్ట్రాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందన్నారు.

జీవితంలో ఉన్నత శిఖరాలు

ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల్లో పాల్గొనడం వల్ల జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే ప్రపంచ స్థాయిలో భారతదేశం గర్వపడే విధంగా చేయగల సత్తా యువతలో ఉందన్నారు. ఆలిండియా క్యారమ్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్, ఆంధ్రరాష్ట్ర క్యారమ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నీరజ్‌కుమార్ సంపతి మాట్లాడుతూ కొత్తపోకడలతో, సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా క్యారమ్ క్రీడ ఉన్నత స్థాయికి వెళుతుందన్నారు. ఇంటర్నేషనల్ క్యారమ్ ఫెడరేషన్ సెక్రటరీ వీడీ నారాయణ్, ఆలిండియా క్యారమ్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ భారతినారాయణ్, ఐసీఎఫ్ ట్రెజరర్ మదన్‌రాజ్ క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడంలో జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందన్నారు.

క్రీడాకారులకు సన్మానం

వరల్డ్ కప్ విజేతలు శ్రీనివాస్ (తెలంగాణ), ఖాజీమా (తమిళనాడు) జట్టు సభ్యులను, క్యారమ్ క్రీడలో ఏకైక అర్జున్ అవార్డు గ్రహీత ఆంథోని మరియు ఇదుహృదయమ్‌లను ఘనంగా సన్మానించారు.



క్యారమ్‌లో తలపడుతున్న జట్లు

పోటీలు ఇలా

ఈ టోర్నీలో భారతదేశంలోని 30 రాష్ట్రాలు నుంచి 400 మంది క్రీడాకారులు, ప్రపంచకప్ విజేత కె.శ్రీనివాస్ (తెలంగాణ), మహిళా విభాగంలో ప్రపంచకప్ విజేత ఖాజీమా(తమిళనాడు), దేశంలోని 9 ప్రముఖ కేంద్రపాలిత సంస్థల నుంచి క్రీడాకారులు పోటీపడనున్నారు. 50 మంది టెక్నికల్ టీం, జట్టు మేనేజర్లు, కోచ్‌లు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అబ్దుల్ జలీల్, టోర్నీ కో-చైర్మన్ మలిరెడ్డి కోటారెడ్డి, జిల్లా క్యారమ్ అసోసియేషన్ సీహెచ్ శ్రీమన్నారాయణ, నెల్లూరుక్లబ్ కార్యదర్శి, టోర్నీ నిర్వాహక కార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, అసోసియేషన్ కోశాధికారి వీఆర్ శ్రీధర్ తదితరులు టోర్నీ పర్యవేక్షకులుగా వ్యవహరిస్తున్నారు.

తొలిరోజు ఫలితాలు

మహిళల డబుల్స్ విభాగంలో..

పాపియా బిశ్వాస్, కాజోల్‌సింగ్ (బెంగాల్), ఎస్.బేగం, ఉపాసన (ఉత్తరప్రదేశ్)లపై 25-0, 25-5 పాయింట్ల తేడాతో విజయం సాధించారు. హుస్నాసమీర, ఎ.భవాని (ఏపీ), సుమ, సౌమ్యశ్రీ (కర్ణాటక)లపై 25-4, 25-6 పాయింట్ల తేడాతో విజయం సాధించారు. కాజల్‌కుమార్, ఆకాంక్షకదమ్ (పీఎస్‌పీబీ) కీర్తన, డెన్నీ(తమిళనాడు)లపై 04-20, 25-07, 25-15 పాయింట్ల తేడాతో విజయం సాధించారు.

పురుషుల విభాగంలో..

వైఎస్‌డీ రమేష్, జనార్దన్‌రెడ్డి (ఏపీ) శివదయాళ్‌యాదవ్, వాకీబ్ ఇక్బాల్ (ఏఏఐ)పై 21-18, 14-24, 23-21 పాయింట్‌ల తేడా విజయం సాధించారు. ఫైజ్‌ఖురేషీ, ఎండీ షాహిద్ (ఢిల్లీ), బీటీ విపుల్‌సూథే, మయూర్ (గుజరాత్)పై 24-1, 9-20, 25-0 పాయింట్ల తేడాతో విజయం సాధించారు. ఎండీ హకీమ్, జిబాన్‌దేవ్ (బీఎస్‌ఎన్‌ఎల్), బీటీఎస్ జమాల్, కెడియద్వాల్ (యూపీ)పై 17-19, 23-9, 19-18 పాయింట్ల తేడాతో విజయం సాధించారు. అబ్దుల్ అసిఫ్, కుబేంద్రబాబు (తమిళనాడు), సెబాస్టియన్, అనిత్‌సింగ్ (పుదుచ్చేరి)పై 25-6, 18-19, 24-19 పాయింట్ల విజయం సాధించారు. జాహీర్‌పాషా, ప్రశాంత్‌మోర్ (ఆర్బీఐ), సంజయ్‌మాలిక్, సాగర్‌వాగ్మారే (మహారాష్ట్ర)పై 25-15, 0-15, 22-01 పాయింట్ల తేడాతో గెలుపొందారు.

కాకాణితో ప్రసన్న భేటీ



మాజీ మంత్రి కాకాణితో మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కోవూరుకు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు

నెల్లూరు(బారకాసు): మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆదివారం పొదలకూరురోడ్డులోని సాయిరాంనగర్‌లో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. ఆయనతోపాటు ఇటీవల పార్టీ జిల్లా కమిటీలో పదవులు పొందిన కోవూరు నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రజలకు అండగా ఉండి ప్రభుత్వంపై పోరాడాలని కాకాణి సూచించారు.

రేషన్ సరుకుల పంపిణీ ఎప్పుడు?

- శ్రీనివాసపురంకాలనీ గిరిజనుల ఆకలి కేకలు

కోవూరు: జనవరి నెలకు సంబంధించి ఐదు రోజులు గడిచినా మండలంలలోని గంగవరం మజరా శ్రీనివాసపురంకాలనీలో గిరిజనులకు రేషన్ సరుకులు పంపిణీ చేయకపోవడంతో ఆకలితో అలమటిస్తున్నారని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మానికల మురళి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం గిరిజన సంఘ నాయకులతో కలిసి కాలనీలో క్షేత్రస్థాయి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో వాసులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మాట్లాడుతూ కూలినాలి చేసుకొంటేనే పూట గడిచే గిరిజనులకు సక్రమంగా బియ్యం ఇవ్వడం లేదని, ప్రతి రోజు వారు శ్రీనివాసపురం సెంటర్లో పడిగాపులు కాస్తు, ఉసూరుమంటూ తిరిగి వెళుతున్నారన్నారు. వ్యక్తిగత కక్షలతో సకాలంలో బియ్యం అందకుండా వ్యవహరిస్తున్నారన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఈ విధంగా జరుగుతుందని, వెంటనే స్పందించి సకాలంలో బియ్యం అందేలా చూడాలని కోరారు.



నిరసన తెలుపుతున్న గిరిజనులు



సత్కారం అందుకున్న ప్రపంచకప్ విజేతలతో నిర్వాహకులు







పోటీల్లో తలపడుతూ..

పోటాపోటీగా..

క్యారమ్స్ పోటీల నిమిత్తం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు, నిర్వాహకులతో నెల్లూరు క్లబ్ ఆదివారం సందడిగా మారింది. నువ్వా.. నేనా.. అన్నట్లుగా క్రీడాకారులు పోటీల్లో తలపడ్డారు.

– నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)



ఆలోచిస్తూ..



పోటీలకు విచ్చేసిన వారు తదితరులు

వీధికో బెల్టు షాపు



ఏరులై పారుతున్న మద్యం

- జిల్లాలో 1,500కు పైగా బెల్టు షాపులు
- ప్రజల జీవితాలతో కూటమి నేతల చెలగాటం
- మొక్కుబడి దాడులకే ఎక్సైజ్ శాఖ పరిమితం

కూటమి ప్రభుత్వం ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోంది. సీఎం చంద్రబాబు వల్ల వీధికో బెల్టు షాపు ఏర్పాటైంది. వేలమంది మహిళలు జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. మద్యం షాపుల నుంచి బెల్టు షాపులకు బాటిళ్లను తరలిస్తున్నట్లు తెలుస్తోంది. కూటమి నేతల ప్రోత్సాహంతో జిల్లాలో బెల్టు దుకాణాల ద్వారా మద్యం ఏరులై పారుతున్న విషయం తెలిసినా ఒత్తిళ్ల కారణంగా సంబంధిత అధికారులు మొక్కుబడి దాడులకే పరిమితమైనట్లు విమర్శలున్నాయి.



దుత్తలూరులో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీతో అధికారిక షాపులు, బెల్టు షాపుల ఏర్పాటుతో ఊరూవాడా మద్యం ఏరులై పారుతోంది. ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన కూటమి సర్కార్ లిక్కర్‌ను మాత్రం ప్రతి వీధికి తీసుకెళ్లి ప్రజలను బానిసలుగా మార్చి ఇళ్లు, ఒళ్లును గుల్ల చేస్తోంది. సంపద సృష్టిస్తామని ఎన్నికల ముందు పదేపదే చెప్పిన కూటమి పెద్దలు ఈ తరహాలో జనం జేబుల్ని కొల్లగొట్టి ఖజానా నింపుకొంటున్నారన్న విమర్శలున్నాయి. బెల్టు షాపులు, అక్రమ రవాణాను నిలువరించాల్సిన ఎక్సైజ్ అధికారులు ఒత్తిళ్ల కారణంగా అడపాదడపా దాడులకే పరిమితమయ్యారు. దీంతో 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటోంది. యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తే బెల్టు షాపులకు అడ్డుకట్ట పడుతుంది. కానీ ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాల్లేవు.

ఇష్టారాజ్యంగా..

జిల్లాలో అధికారికంగా 182 మద్యం దుకాణాలు, 55 బార్ అండ్ రెస్టారెంట్లున్నాయి. అధిక శాతం దుకాణాలు అధికార పార్టీ నేతలవే కావడంతో ఎక్సైజ్ అధికారులను తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. మద్యం షాపుల్లో ఉదయం పది నుంచి రాత్రి పది గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్లలో పది నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే విక్రయాలు సాగించాల్సి ఉంది. వ్యాపారులు నిబంధనలకు నీళ్లొదిలారు. అనేక ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచే విక్రయాలు సాగుతున్నాయి.

విచ్చలవిడిగా పర్మిట్‌రూమ్‌లు

నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు సాగించినా, బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసినా కేసులు నమోదు చేయడంతోపాటు దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ఆర్భాటంగా ప్రకటించారు. కానీ క్షేత్రస్థాయిలో కూటమి నేతలు చేస్తున్న పనుల గురించి ఆయనకు తెలియంది కాదు. మీడియా ముందు హడావుడి చేశారని విమర్శలున్నాయి. మద్యం దుకాణాల పక్కనే మినీబార్లను తలపించేలా పర్మిట్‌రూమ్‌లను తెరిచారు. ఇక బెల్టు షాపులు గ్రామ, గ్రామానా పుట్టుకొచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 1,500 పైచిలుకు బెల్టు షాపులున్నట్లు సమాచారం. వాటిల్లో క్వార్టర్‌పై రూ.30 నుంచి రూ.50 అదనంగా వసూలు చేస్తుండగా.. కొందరు సిట్టింగ్‌రూమ్‌లు ఏర్పాటు చేసి మందుబాబులు తాగేందుకు చోటు కల్పించారు.

వాటిల్లో కూడా..

జిల్లాలో చిన్నా, పెద్ద కలిపి 300కు పైగా ధాబాలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మద్యం విక్రయించాలంటేనే భయపడే పరిస్థితి ఉండేది. ఎన్నికల ఫలితాల అనంతరం పరిస్థితి అందుకు భిన్నంగా మారిపోయింది. అన్ని హంగులతో ధాబాలను తీర్చిదిద్దారు. మద్యం మీరు తెచ్చుకున్నా సరే.. లేదంటే సిబ్బందే సమకూరుస్తారని నిర్వాహకులు ఆఫర్లు ఇస్తున్నారు. ఉదయం పది గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం తాగిస్తున్నారు.

అడపాదడపా..

నిబంధనల ఉల్లంఘనులపై కేసులు నమోదు చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు మొక్కుబడి చర్యలకే పరిమితమయ్యారన్న విమర్శలున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్, స్క్వాడ్ అధికారులు అడపాదడపా దాడులకే పరిమితమైనట్లు తెలుస్తోంది. బెల్టు విక్రయాలపై దాడులు చేసి నిందితుల అరెస్ట్‌లతో సరిపెట్టుకుంటున్నారు. నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చాక ఇప్పటి వరకు 380 కేసులు నమోదు చేసి 382 మందిని అరెస్ట్ చేశారు. 879.2 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. అసలు ఈ బాటిల్ ఏ షాపు నుంచి వచ్చింది? ఎవరు సరఫరా చేశారు? అనే మూలాల్లోకి వెళ్లకపోవడం విమర్శలకు తావిస్తోంది. అనేక దుకాణాల నుంచే బెల్టుకు మద్యం సరఫరా అవుతున్నట్లు సమాచారం. అయితే ఇంత వరకు ఒక్క దానిపై కూడా కేసు నమోదు కాకపోవడం గమనార్హం.

గత నెలలో..

- జలదంకి మండలంలో ఓ వ్యక్తి మద్యం విక్రయిస్తుండగా ఎక్సైజ్ సిబ్బంది దాడులు చేశారు. 12 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు.
- జలదంకి మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తుండగా ఎక్సైజ్ సిబ్బంది దాడులు చేసి పది బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.
- దుత్తలూరు మండలంలోని వేర్వేరు చోట్ల జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి 45 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు.
- జలదంకి మండలంలోని హనుమకొండపాళెంలో ఓ వ్యక్తి అనధికారికంగా మద్యం విక్రయిస్తుండగా కావలి ఎక్సైజ్ సిబ్బంది దాడులు చేసి 15 బాటిళ్లను సీజ్ చేశారు.
- మండల కేంద్రమైన కలిగిరిలో అనధికారికంగా మద్యం అమ్మకాలు జరుపుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 34 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.
- జలదంకి మండలంలో కావలి ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించి 12 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు.
- అనుమసముద్రంపేట మండలంలో ఓ వ్యక్తి అక్రమంగా 18 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.



ఉదయగిరిలో స్వాధీనం చేసుకున్న బాటిళ్లు (ఫైల్)

ఈనెలలో..

- బెల్టు దుకాణాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు వన్ అధికారులు దాడులు చేశారు. వైఎస్సార్ నగర్‌లో ఓ మహిళ నుంచి 11 క్వార్టర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.
- ఎక్సైజ్ నెల్లూరు – 1 అధికారులు వావిలేటిపాడులోని బెల్టు దుకాణంపై దాడులు చేసి ఓ వ్యక్తి తొమ్మిది క్వార్టర్‌ల మద్యం బాటిళ్లను సీజ్ చేశారు.

దాడులు చేస్తున్నాం

నిబంధనల ఉల్లంఘనులపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. బెల్టుషాపులను ఉపేక్షించేది లేదు. నిరంతరం దాడులు చేస్తున్నాం. ఇప్పటి వరకు 380 కేసులు నమోదు చేసి 382 మందిని అరెస్ట్ చేశాం. నిబంధనలు పాటించని వ్యాపారులపై కేసులు నమోదు చేస్తాం.

– టి.శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్




కొండాయపాళేనికి వెళ్లే రహదారిలోని ఓ రెస్టారెంట్‌లో మద్యం తాగుతూ..



అందంగా ఉన్నా కదా..

అద్దం కనిపిస్తే చాలు.. చాలామంది అందులో తమను తాము చూసుకుని మురిసిపోతుంటారు. ఆదివారం నెల్లూరు క్లబ్‌లో పార్క్ చేసిన మోటార్‌బైక్ వద్దకు పిట్ట వచ్చింది. అద్దంలో తన రూపాన్ని చూసుకుంటుండంగా సాక్షి తీసిన చిత్రం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



నీలాకాశం.. మనోహరం

అది నెల్లూరులోని పొట్టేపాళెం ప్రాంతం. ఆహ్లాదకరమైన ఉదయం.. దట్టంగా కమ్మేసిన మేఘాల చాటున భానుడు చేరగా నీలాకాశం మనోహరంగా మారింది. పొలంలోని నీటిలో ఆ ప్రతిబింబం సుందరంగా కనిపించింది. ఈ దృశ్యాన్ని ఆదివారం సాక్షి క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

చందన, సీఎంఆర్ న్యూ ఇయర్ బంపర్ డ్రా



కారు విజేతకు నమూనా కీ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



స్కూటీ విజేత

- మలేసియా ట్రిప్ విజేత కె.మోహన్

నెల్లూరు(బృందావనం): క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి సందర్భంగా నెల్లూరు సీఎంఆర్, చందన ప్రవేశపెట్టిన ఎక్స్‌ప్రెస్ సేల్లో భాగంగా న్యూ ఇయర్ బంపర్ డ్రా పెట్టారు. మలేసియా ట్రిప్ డ్రాను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదివారం తీశారు. మర్రిపాడుకు చెందిన కె.మోహన్‌ను విజేతగా ప్రకటించారు. వీక్లీ డ్రా టీవీఎస్ స్కూటీ విజేతగా నెల్లూరు చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డులోని హరికృష్ణ నిలిచారు. క్రిస్మస్ బంపర్ డ్రాలో పడుగుపాడుకు చెందిన హనీఫా విజేతగా నిలువగా ఆమెకు కారును అందజేశారు. గత వీక్లీ డ్రా టీవీఎస్ జెస్ట్ విజేత ధన్విక్‌కు టీవీఎస్ స్కూటీని పంపిణీ చేశారు. అలాగే 35 మంది డైలీ డ్రా విజేతలకు గ్రైండర్, మిక్సీ, రైస్‌కుక్కర్, డిన్నర్ సెట్లు తదితరాలను ఇచ్చారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ చందన, సీఎంఆర్ ప్రజల్లో మంచిపేరు సంపాదించుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చందన అధినేత మావూరి శ్రీనివాసరావు, మోపూరు పెంచలయ్య, సుబ్బన్న, శైలేష్, మేనేజర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలు చెప్పి..

- మహిళ గొలుసు తెంపుకెళ్లిన దుండగుడు

నెల్లూరు(క్రైమ్): ఆస్పత్రిలోని ఆయాను మాటల్లో దించి ఆమె మెడలోని గొలుసును గుర్తుతెలియని దుండగుడు తెంపుకెళ్లాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు గాంధీ నగర్ సమీపంలో వీఎంఆర్ నగర్‌కు చెందిన బుజ్జమ్మ మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఓ నర్సింగ్‌హోంలో ఆయాగా పనిచేస్తోంది. ఈనెల 4వ తేదీ రాత్రి ఆమె హాస్పిటల్‌కు వెళ్లింది. అక్కడికి వచ్చిన గుర్తుతెలియని యువకుడు ఆమెతో మాటలు కలిపాడు. ఒక్కసారిగా మహిళ మెడలోని 16 గ్రాముల బంగారు గొలుసును తెంపుకెళ్లాడు. బాధితురాలు చిన్నబజారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది. నిందితుడు హిందీలో మాట్లాడుతున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఆదివారం కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

22 లీటర్ల నాటుసారా స్వాధీనం

- 500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఐదురోజులుగా దాడులు కొనసాగిస్తున్నారు. నాలుగు కేసులు నమోదు చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. 22 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప, చెంచులక్ష్మీపురం, వెంకటేశ్వరపురం, బోగోలు, తాళ్లూరు, నాగులవరం, కడనూతల, దగదర్తి మండలంలోని ఉలవపాడు గ్రామాల్లో సారా తయారు చేస్తున్నారని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు, డీపీఈఓ శ్రీనివాసులునాయుడికి సమాచారం అందింది. ఈనెల ఒకటో తేదీ నుంచి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా వారు ఆకస్మిక దాడులు చేస్తున్నారు. సారాను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఆయా ప్రాంత ప్రజలకు సారా జోలికి వెళ్లొద్దని అవగాహన కల్పిస్తున్నారు. నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సీతారామపురం: ఉదయగిరి – సీతారామపురం జాతీయ రహదారి మార్గంలోని పోలంగారిపల్లి గ్రామ రోడ్డు సెంటర్ వద్ద ఆదివారం రాత్రి రెండు మోటార్‌బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో సీతారామపురం బెస్తకాలనీకి చెందిన వాసు, సోంపల్లి గ్రామానికి చెందిన రమేష్, లక్ష్మయ్యలు గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కండలేరులో 56.920 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 56.920 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 700 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,050, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 107
లేయర్ (లైవ్) : 85
బ్రాయిలర్ చికెన్ : 196
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 216
లేయర్ చికెన్ : 145

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.28
సన్నవి : రూ.23
పండ్లు : రూ.12

